www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 13 జూన్ 2024

ఇపి సెట్‌లో ప్రతిభ చాటిన 'కృష్ణారెడ్డి సిద్ధార్థ' విద్యార్థులు

ప్రజాశక్తి-మదనపల్లి అర్బన్

పట్టణంలోని కృష్ణారెడ్డి సిద్ధార్థ కళాశాల విద్యార్థులు ఇపి సెట్ ఫలితాలలో ప్రభంజనం సృష్టించారు. మంగళవారం విడుదలైన ఈ ఫలితాలలో కళాశాలకు చెందిన మహేంద్ర 3,985 ర్యాంక్‌తో ప్రథమ స్థానం సాధించారు. పి.మహేష్ 5,102, ఎం.గౌతమి 5,627, పి.అల్తాఖాన్ 7,532, పి.హర్ష వర్ధన్ 7,835, బి.బాలాజి 9,215, ఎస్.హిమయక్షిత్ 11,299, ఎం.కిశోర్ 12,354, జి.తుషార్ 13,392, కె.లోహిత 14,207, బి.పుష్పప్రియ 14,966 ర్యాంకులను సాధించి కళాశాలను అగ్రస్థానంలో నిలిపారు. వీరందరినిబుధవారం కళాశాల ప్రిన్సిపల్ కృష్ణారెడ్డి, అధ్యాపకులు అభినంది శుభాకాంక్షలు తెలిపారు. ఇంతటి మన విజయానికి కారకులైన విద్యార్థుల తల్లిదండ్రులకు, అధ్యాపకులకు, అధ్యాపకేతర బృందానికి ప్రిన్సిపల్ కృతజ్ఞతలు తెలిపారు. కళాశాలలో కేక్ కట్ చేసి, విద్యార్థులకు తీపి తినిపించి సంబరాలు చేసుకున్నారు.

విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ కృష్ణారెడ్డి

'మండిపల్లి'కి అమాత్య యోగం

- వైఎస్ఆర్ జిల్లాకు దక్కని కేబినెట్ బెర్త్
- సీనియర్ ఎమ్మెల్యేలకు తప్పని నిరాశ
- టిడిపి శ్రేణుల్లో మౌనరాగం

రాష్ట్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తున్న రాంప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి - కడప ప్రతినిధి/రాయచోటి

అన్నమయ్య జిల్లా రాయచోటి ఎమ్మెల్యే మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని మంత్రి పదవి వరించింది. బుధవారం మధ్యాహ్నం విజయవాడలో టిడిపి అధ్యక్షులు చంద్రబాబు ముఖ్యమంత్రిగా కూటమి సర్కారు కొలువుదీరింది. సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు ఎక్కువ సంఖ్యలో గెలిచిన సంగతి తెలిసిందే. తాజాగా ఏర్పాటు చేసిన మంత్రి మండలిలో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ముద్ర కనిపించింది. కడప, అన్నమయ్య జిల్లాలో తొలిసారి గెలిచిన అభ్యర్థులు ఇద్దరికి చొప్పున నలుగురు ఎమ్మెల్యేలు ఉన్నారు. వీరిలో మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి రాజకీయ ప్రస్థానం ప్రత్యేకతను సంతరించుకుంది. ఈయన రాయచోటి టికెట్ దగ్గర నుంచి గెలుపు, కేబినెట్ బెర్త్ వరకు పోరాడి దక్కించుకున్న వైనం ఆసక్తిని కలిగిస్తోంది.

కడప, అన్నమయ్య జిల్లాలో మంత్రి పదవికి అర్హులైన ఎమ్మెల్యేలు ఎక్కువగా ఉన్న సంగతి తెలిసిందే. ఇటువంటి పరిస్థితి నేపథ్యంలో పలువురు ఆశావహులు ఆఖరి వరకు పోరాటం చేయాల్సి వచ్చింది. కడప, అన్నమయ్య జిల్లాలకు సంయుక్తంగా ఉమ్మడి కడప జిల్లాలో భాగమైన రాయచోటి అభ్యర్థికి మంత్రి పదవిని కేటాయించినట్లు తెలుస్తోంది. అన్నమయ్య జిల్లాకు పొరుగున ఉన్న చిత్తూరు జిల్లాకు కేబినెట్ బెర్త్ ఖరారు విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు వారికి పరిమితం చేయడం గమనార్హం. ఇటువంటి ప్రత్యేక పరిస్థితులను పరిగణలోకి తీసుకుని ఉమ్మడి కడప జిల్లాలో భాగమైన రాయచోటి ఎమ్మెల్యేను అమాత్యయోగం వరించినట్లు తెలుస్తోంది. ఏదేమైనప్పటికీ కింద అంగళ్ల ప్రాంతంలో చెలరేగిన అల్లర్లను దృష్టిలో ఉంచుకుని కేబినెట్ బెర్త్ కేటాయించారనే విశ్లేషణలు ఉన్నాయి.

కూటమి సర్కారులో సీనియర్ ఎమ్మెల్యేలకు నిరాశ తప్పలేదు. రాష్ట్ర వ్యాప్తంగా సీనియర్లు మంత్రి మండలికి దూరంగా ఉంచడం చర్చ నియాంశంగా మారింది. కడప జిల్లాలో సీనియర్ ఎమ్మెల్యేలు ప్రొద్దుటూరు ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి, జమ్మలమడుగు బిజెపి ఎమ్మెల్యే సి.ఆదినారాయణరెడ్డి, తొలిసారి ఎన్నికైన మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్, కడప ఎమ్మెల్యే ఆర్.మాధవి, కమలాపురం ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి మధ్య కేబినెట్ బెర్త్ కోసం తీవ్రమైన పోటీ నెలకొంది. అన్నమయ్య జిల్లా నుంచి పీలేరు ఎమ్మెల్యే కిషోర్‌కుమార్‌రెడ్డి, మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్‌బాషా సీనియర్ ఎమ్మెల్యేలు, తొలి సారిగా రాయచోటి, రైల్వేకోడూరు నుంచి ఎన్నికైన ఎమ్మెల్యేలు ఉన్నారు. ఇటువంటి తీవ్రమైన పోటీ నెలకొన్న నేపథ్యంలో రాయచోటి యువ ఎమ్మెల్యే అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి వైపు మొగ్గు చూపించినట్లు తెలుస్తోంది.

రాయచోటి మంత్రి కల నెరవేరింది..

1952 సంవత్సరంలో రాయచోటి నియోజకవర్గం ఏర్పడినప్పుడు నుండి ఇంతవరకు రాయచోటికి మంత్రి పదవి దక్కలేదు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో రాయచోటి నియోజకవర్గం గెలిచిన మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి మంత్రి పదవి దక్కడంతో 72 ఏళ్లకు నెరవేరింది. గతంలో సుగవాసి పాలకొండ రాయుడు, నాగిరెడ్డి, నారాయణరెడ్డి, గడికోట శ్రీకాంత్‌రెడ్డిలు ఎమ్మెల్యేలుగా పనిచేసినా ఒక్కరిని కూడా మంత్రి పదవి వరించలేదు. ఇన్నేళ్ల తర్వాత మంత్రి పదవి రావడంతో రాయచోటి ప్రాంత వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

'మండిపల్లి' రాజకీయ ప్రస్థానం

రాయచోటి నియోజకవర్గంలోని చిన్నమండెం మండలం బోరెడ్డిగారిపల్లిలో మండిపల్లి నాగిరెడ్డి, సుశీలమ్మ దంపతుల మూడవ సంతానం కవలలు రాంప్రసాద్‌రెడ్డి, లక్ష్మీప్రసాద్‌రెడ్డి జన్మించారు. పాఠశాల విద్య కడప, ఇంటర్ తిరుపతి, బిడిఎస్ బెంగళూరులో పూర్తి చేశారు. రాంప్రసాద్‌రెడ్డి తండ్రి నాగిరెడ్డి 1985, 1989లో రాయచోటి ఎమ్మెల్యేగా పనిచేశారు. రాంప్రసాద్‌రెడ్డి సోదరుడు నారాయణరెడ్డి 1993, 1994లో ఎమ్మెల్యేగా పనిచేశారు. రాంప్రసాద్‌రెడ్డి 2003లో కాంగ్రెస్ నుండి రాజకీయం ప్రస్థానం మొదలు పెట్టారు. తన సోదరి శ్రీలతరెడ్డి 2004లో రాయచోటి నుండి కాంగ్రెస్ పార్టీ తరుపు పోటీ చేసీ ఓడిపోయారు. రాంప్రసాద్‌రెడ్డి సుశీలమ్మ చిన్నమండెం మండలం ఎంపిపిగా పనిచేశారు. 2012 ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరుపున పోటీ చేసి ఓటమిపాలయ్యారు. 2014లో సమైక్యాంధ్ర పార్టీ తరుపున పోటీ చేసి ఓడిపోయారు. అనంతరం వైసిపిలో చేరి 2019లో గడికోట శ్రీకాంత్‌రెడ్డి మద్దతుగా నిలిచారు. వైసిపి పార్టీలో సముచిత స్థానం ఇవ్వకపోవడంతో రెండేళ్ళ పాటు ప్రజా సమస్యలపై పోరాటం చేశారు. ఆ తర్వాత రాంప్రసాద్‌రెడ్డి టిడిపిలో చేరి మంత్రి అయ్యారు.

జ్ఞానపీఠ పురస్కారానికి వన్నెతెచ్చిన కవి 'సినారె'

- ఆచార్య టి.రామప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి-కడప అర్బన్

తెలుగు సాహిత్యానికి ఎనలేని సేవ చేసి, 1988లో విశ్వంభర కావ్య రచనకు జ్ఞానపీఠ పురస్కారాన్ని పొంది ఆ పురస్కారానికే వన్నె తెచ్చిన కవి సి.నారాయణరెడ్డి అని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య టి.రామప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం బుధవారం సి.కె.సంపత్ కుమార్ పఠన మందిరంలో సినారె ఏడవ వర్ధంతిని నిర్వహించింది. సినారె చిత్రపటానికి పూలమాల సమర్పించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనం పర్యవేక్షణలో సినారె 'ఆధునికాంధ్ర కవిత్వం-సంప్రదాయములు, ప్రయోగములు' అనే విషయంపై పరిశోధన సాగించి, 1962లో పిహెచ్‌డి పట్టాను పొందారన్నారు. ఆయన 1963లో ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగుశాఖలో 'రీడర్' అయ్యారని, 1976లో ఆచార్యులై 1981 వరకు ఆచార్యులుగా బోధన సాగించారన్నారు. ఆయన పరిశోధన గ్రంథం గొప్ప ప్రామాణిక గ్రంథంగా సాహితీ చరిత్రలో నిలిచిపోయిందన్నారు. సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంతో సినారెకు చాలా అనుబంధం ఉందని, రాజ్యసభ సభ్యులుగా ఆయన తన నిధుల నుంచి రెండవ అంతస్తుకు రూ.10 లక్షలు ఇచ్చారన్నారు. తెలుగు చలనచిత్ర రంగంలో 1962లో అడుగుపెట్టి ఆయన రాసిన పాటలు ఎంతో ప్రసిద్ధి చెంది మైలురాళ్లగా నిలిచాయన్నారు. నవ్వని పువ్వు అనే నృత్యరూపకం ఆయన తొలి రచన అని పేర్కొన్నారు. ఆయన అధికార భాషా సంఘం అధ్యక్షులుగా, తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులుగా, భాషా సాంస్కృతిక సలహాదారుగా, సాంస్కృతిక మండలి అధ్యక్షులుగా సేవలందించారన్నారు. సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి మాట్లాడుతూ సినారె 85కు పైగా రచనలు చేశారని, మూడువేలకు పైగా చలనచిత్ర గీతాలు రాశారన్నారు. హైదరాబాదులోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సారస్వత విశ్వవిద్యాలయానికి తొలి ఉపాధ్యక్షత వహించిన ఘనత సినారెదే అన్నారు. సినారె ప్రాంతీయ భేదం లేని కవి అని, 'తెలుగు జాతి మనది, నిండుగ వెలుగుజాతి మనది' అనే పాటతో ఆయన ఆ విషయాన్ని స్పష్టం చేశారన్నారు. మరో సహాయ పరిశోధకులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి మాట్లాడుతూ బ్రౌన్ పరిశోధన కేంద్రానికి 1998లో ఒకసారి, 2003లో మరోసారి రావడమే కాక ఆర్థిక సహకారాన్ని అందించి తోడ్పడ్డారన్నారు. ఆయన తొలి చలనచిత్ర గీతం గులేబకావళి కథ సినిమా కోసం 1961లో రాశారన్నారు. హైదరాబాదు టాంక్‌బండ్‌లో తెలుగు సాహితీమూర్తుల విగ్రహాలు నెలకొల్పడంలో అప్పటి ప్రభుత్వానికి సహాయ సహకారాలు అందించారన్నారు. గ్రంథాలయ సహాయకులు ఎన్.రమేష్‌రావు మాట్లాడుతూ సినారె మొత్తం రచనలు 14 సంపుటాలుగా వెలువడ్డాయని, అవన్నీ పరిశోధన కేంద్రంలో పాఠకులకు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం జూనియర్ అసిస్టెంట్ ఆర్.వెంకటరమణ, సిబ్బంది సి.నీలకంఠేశ్వర్, హరికృష్ణ, యోవేవి తెలుగుశాఖ పరిశోధక విద్యార్థిని భారతి, పాఠకులు కె.రామసుబ్బయ్య, ఎం.సుదర్శన్‌రెడ్డి, ఎం.చంద్ర, కె.వి.సురేష్‌బాబు, బి.శ్రీను పాల్గొన్నారు.



సినారె చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బ్రౌన్ గ్రంథాలయ సిబ్బంది

15న కవితల పోటీలు

ప్రజాశక్తి-కడప అర్బన్ : శ్రీశ్రీ వర్ధంతి సందర్భంగా సిపి బ్రౌన్ గ్రంథాలయంలో ఈనెల 15 సాయంత్రం 5 గంటలకు కవితల పోటీని నిర్వహిస్తున్నట్లు సాహితీ స్రవంతి జిల్లా కన్వీనర్ లెనిన్ ప్రసాద్, రాష్ట్ర ఉపాధ్యక్షులు కుమారస్వామి ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కవితల పోటీలో పాల్గొన్న వారందరికీ బహుమతులు అందజేస్తామని తెలిపారు. కడప నగరంలోని సాహిత్యకారులు, కవులు, యువతి యువకులంతా ఈ పోటీలో పాల్గొని శ్రీశ్రీ సాహిత్యం సామాజిక సమకాలీనత అన్న అంశం పైన కవిత్వం రాసి బహుమతులను స్వీకరించాలని పేర్కొన్నారు. ఈ పోటీకి సంబంధించిన వివరాల కోసం నంబర్ 919490660424, 9490122229 ను సంప్రదించాలని తెలిపారు.

బ్రౌన్ గ్రంథాలయానికి పుస్తకాలు బహూకరణ

ప్రజాశక్తి-కడప అర్బన్

కడప జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఆకుల సుధారాణి తన భర్త బొక్కసం వెంకటరమణ(విశ్రాంత జిల్లా జడ్జి) జ్ఞాపకార్థం తిరుమల తిరుపతి దేవస్థానములు ముద్రించిన ఆంధ్రమహాభారతం 18 పర్వాలను సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య టి.రామప్రసాదరెడ్డికి బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుధారాణి బహూకరించిన 18 పర్వాల పుస్తకాలను పాఠకులకు అందుబాటులో ఉంచుతామన్నారు. కార్యక్రమంలో ఆకుల కిశోర్ బాబు, బొక్కసం మహతి, ఎం.నాగరాజు, బ్రౌన్‌భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి, డాక్టర్ భూతపురి గోపాలకృష్ణ, గ్రంథాలయ సహాయకులు ఎన్.రమేశ్‌రావు, జూనియర్ అసిస్టెంట్లు ఆర్.వెంకటరమణ, ఎం.మౌనిక, సిబ్బంది నీలకంఠేశ్వర్ పాల్గొన్నారు. గ్రంథాలయానికి పుస్తకాలను బహూకరించిన ఆకుల సుధారాణిని వైవీయూ విసి ఆచార్య చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి.వెంకటసుబ్బయ్య అభినందించారు.

పుస్తకాలు అందజేస్తున్న పిపి సుధారాణి

28 నుంచి వైవీయూ పీజీ పరీక్షలు

ప్రజాశక్తి-కడప అర్బన్

యోగి వేమన యూనివర్సిటీ ఎంఎ, ఎంకామ్, ఎంఎస్‌సి, ఎంపిఇడి పోస్ట్ గ్రాడ్యుయేషన్ డిగ్రీ 2, 4 సెమిస్టర్ల పరీక్షలు ఈ నెల 28వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ ఎన్.ఈశ్వర్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2వ సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 28వ తేదీన, జులై 1, 3, 5, 8, 10వ తేదీలలో ఉంటాయని తెలిపారు. 4వ సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 29, జులై 2, 4, 6, 9, 11వ తేదీలలో ఉంటాయని పేర్కొన్నారు. నిర్ణీత తేదీల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష ఉంటుందని తెలిపారు. విద్యార్థులు సంబంధిత శాఖలో హాల్ టికెట్లు పొంది పరీక్షలకు హాజరు కావాలని పేర్కొన్నారు.

ఎపి టెట్ ఫలితాలను విడుదల చేయాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

గత రాష్ట్ర ప్రభుత్వం డీఎస్సీకి ఎలిజిబుల్ నిమిత్తం ముందుగా టెట్‌ను నిర్వహిం చిందని, వాటి ఫలితాలను విడుదల చేయాలని సిపిఎం విద్యార్థి, యువజన సంఘాల బాధ్యుడు ఎ.వినయ్‌కుమార్ డిమాండ్ చేశారు. స్థానిక ఎన్జీవో కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ గత రాష్ట్ర ప్రభుత్వం టెట్ పరీక్షను డీఎస్సీ అభ్యర్థులకు టెట్ నిర్వహించగా, లక్షల సంఖ్యలో పరీక్షలు రాశారన్నారు. అనంతరం వాటి ఫలితాల కోసం అభ్యర్థులు ఎదురు చూస్తున్నారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో టెట్ నిర్వహించి ఫలితాలను కూడా విడుదల చేశారన్నారు. కొత్తగా ఏర్పాటైన ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం డీఎస్సీ అభ్యర్థులకు తొలి సంతకం చేస్తానని హామీ ఇచ్చిందన్నారు. డీఎస్సీ కంటే ముందుగా గత ప్రభుత్వం నిర్వహించిన టెట్ ఫలితాలను నూతన ప్రభుత్వం విడుదల చేయాలని కోరారు.

అరుణాచలానికి ప్రత్యేక ఆర్‌టిసి బస్సులు

ప్రజాశక్తి - కడప అర్బన్

అరుణాచలం గిరి ప్రదక్షణ కోసం తిరువన్నామలైకి జిల్లాలోని వివిధ ఆర్‌టిసి డిపోల నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు ప్రజా రవాణా అధికారి గోపాల్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 20, 21వ తేదీల్లో కడప, బద్వేల్, మైదుకూరు, పులివెందుల, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు డిపోల నుంచి బస్సులు బయల్దేరుతాయని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

సెలవులకు టాటా..ఇక బడిబాట!

- నేటి నుంచి పాఠశాలల పునఃప్రారంభం
- 80 శాతం జిల్లాకు చేరిన స్టూడెంట్ కిట్లు
- తొలిరోజే పాఠ్య పుస్తకాలు, యూనిఫాం అందజేత

ప్రజాశక్తి-రాయచోటి

వేసవి సెలవుల అనంతరం ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రయివేట్ పాఠశాలలు గురువారం తెరచుకోనున్నాయి. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ హైస్కూళ్లు 303, ప్రైమరీ 1,734, యుపి 152, మొత్తం 2,199 ప్రభుత్వ పాఠశాలలో ఉన్నాయి. బాలికలు 74,572, బాలురు 68,028 మంది విద్యార్థులు ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 1,42,600 మంది విద్యార్థులు ఉన్నారు. ప్రయివేట్ పాఠశాలలు 574 ఉన్నాయి. ప్రభుత్వ కొన్ని పాఠశాలలు విద్యార్థులకు సమస్యలతో స్వాగతం పలుకు తున్నాయి. మొదటి విడుతలో నాడు నేడు పనులు 963, రెండవ విడతలో 766 మంజూరయ్యాయి. జిల్లాలో కొన్ని పాఠశాలలో శిథిలావస్థకు చేరుకున్నాయి. మండలంలోని గరుగుపల్లిలో ప్రభుత్వ పాఠశాల్లో పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయి. గాలివీడు మండలంలోని చీమల చెరువుపలిలో రెండువ విడతలో నాడు-నేడు పనులు మంజూరు కావడంతో ఉన్న పాఠశాలను పడగొట్టారు. దీంతో విద్యార్థులను అంగన్వాడీ కేంద్రంలో వెళ్తున్నారు. అక్కడ స్థలం సరిపోక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. నాడు నేడు నిర్మాణ పనులు కూడా నత్తనడకన సాగుతున్నాయి.

స్టూడెంట్ కిట్లు సిద్ధం

గత ప్రభుత్వంలో విద్య కానుకగా ఉన్న పేరును ప్రస్తుతం నూతన ప్రభుత్వం స్టూడెంట్ కిట్‌గా పేరు మార్చి అదే కిట్లను విద్యార్థులకు ఇవ్వడానికి సిద్ధం అధికారులు సిద్ధం చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా స్టూడెంట్ కిట్లుగా ఇచ్చే పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్, బ్యాగులు, బూట్లు 80 శాతం వరకు జిల్లాకు వచ్చినాయి.

పాఠశాలల అభివృద్ధికి నిధులు కేటాయించాలి

ప్రభుత్వ పాఠశాల గంట గురువారం మోగా పోతుంది. మధ్యలో ఆగిపోయిన భవనాలను పూర్తి చేసి విద్యార్థులకు ఇటువంటి ఇబ్బందులు లేకుండా చేయాలి. విద్యా సంవత్సరం ప్రారంభంలోనే స్టూడెంట్ కిట్లను 100 శాతం ఇవ్వాలి. అమ్మఒడి పథకాన్ని ఎటువంటి షరతులు లేకుండా ఎంత మంది విద్యార్థులు చదువుతుంటే ఆ కుటుంబంలో అంతమందికి ఇస్తామని చెప్పిన మాటను ముఖ్యమంత్రి నిలబెట్టుకోవాలి. మధ్యాహ్న భోజన పథకాన్ని నాణ్యత పెంచి సన్నబియ్యాన్ని సరఫరా చేయాలి.

- నరసింహ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి, అన్నమయ్య జిల్లా.

పాఠశాలల్లో వసతులు పూర్తి చేశాం

జిల్లా వ్యాప్తంగా గురువారం నుంచి పాఠశాలలు పునః ప్రారంభమవుతున్నాయి. అన్ని పాఠశాలల్లో మౌలిక వసతులను ఏర్పాటు చేశాం. ఒకటవ తరగతి నుండి ఏడవ తరగతి వరకు 4,81,386 పాఠ్యపుస్తకాలు మండలాలకు అందజేశాం. ఇంకా ఏవైనా ఇబ్బందులు ఉంటే పరిష్కరించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూస్తాం.

- శివ ప్రకాష్‌రెడ్డి, డిఇఒ, అన్నమయ్య జిల్లా.

అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవాలి

- సిఐటియు జిల్లా అధ్యక్షులు సి.హెచ్.చంద్రశేఖర్

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

గత ప్రభుత్వంలో ఇసుక రీచ్‌లలో అధికారులు చేసిన అవినీతిపైన విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.చంద్రశేఖర్ అన్నారు. బుధవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం ఎపిఎండిసి ద్వారా ఇసుక అమ్మకాలు చేపట్టిందని తెలిపారు. ఇదే వరంగా భావించిన ఎపిఎండిసి అధికారులు కొంత మంది ప్రయివేట్ కాంట్రాక్టర్‌తో కుమ్మక్కయ్యారని చెప్పారు. వారికి కేటాయించిన చోట ఇసుక తవ్వకాలు జరుపకుండా వేరే ప్రాతంలో ఇసుక తవ్వకాలు జరిపారని విమర్శించారు. ఆ అధికారులకు కాంట్రాక్టర్ భారీగా ముడుపులు ఇచ్చారన్నారు. అధికారులు తనిఖీ చేసి ఎపిఎండిసి అధికారులపై కేసులు కూడా పెట్టారని తెలిపారు. వారి పైన ఎపిఎండిసి యజమాన్యం ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం ఆశ్చర్యం వేస్తోందన్నారు. 28 వేల క్యూబిక్ మీటర్లు అక్రమ రవాణా జరిగిందని, వారి పైన కేసులు ఉన్నా కూడా వారిని హెడ్ ఆఫీస్‌లో గత నెల రిటైర్డ్‌మెంట్ చేసి, వారికి రావలసిన డబ్బును వారికి ఇచ్చి పంపించారని పేర్కొన్నారు. ఇందులో ఎవరి ప్రమేయం ఉందో విచారించి సంస్థకు ప్రభుత్వానికి నష్టం కల్పించిన అధికారులను శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై, ఆ అధికారిపై రిటైర్డ్‌మెంట్ ముందే ఎమ్‌డికి సిఐటియు ఫిర్యాదు చేసిందని గుర్తు చేశారు. రిటైర్డ్ అయి వెళ్లిన అధికారులను సైతం శిక్షించాలని నూతన ప్రభుత్వాన్ని కోరారు. ఇసుక రీచ్‌లలో ఎపిఎండిసి యాజమాన్యం సిసి కెమెరాలు పెట్టకుండానే, వే బ్రిడ్జిలు ఏర్పాటు చేయకుండానే చేసినట్టు చూపించి రూ.కోట్లు ఎపిఎండిసి సొమ్ముని కాజేసిన అప్పటి ఎమ్‌డి మధుసూదన్‌రెడ్డిపై విచారణ జరిపి చట్ట ప్రకారం శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇసుక రీచ్‌ల కోసం దాదాపు రూ.42 కోట్లు సిసి కెమెరాల కుంభకోణం, జరిగినట్లు ఆరోపణలు రావడంతో ఎనిమిది నెలలకే ఎమ్‌డిని ఫైబర్ నెట్‌కి బదిలీ చేశారన్నారు. ఈ విషయంపై, గతంలోనే సిఐటియు ఆందోళన చేసిందని, చర్యలు మాత్రం తీసుకోలేదన్నారు. నూతన ప్రభుత్వం అయినా విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకొని, ఆర్ఆర్ యాక్ట్ ప్రకారం, ఎపిఎండిసి నిధులు రికవరీ చేయాలని కోరారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన తర్వాత, నిధుల విడుదలపైన, కాంట్రాక్టులపైన, కాంట్రాక్టర్లకు లబ్ధి చేకూర్చిన అగ్రిమెంట్లపై విచారణ జరపాలన్నారు. దీనికి సంబంధించి, లావాదేవీలు, మంగంపేట బ్రాంచ్‌లోనూ, సిసి కెమెరాల పూటేజిని భద్రపరచాలని తెలిపారు. దీన్ని డిలీట్ చేస్తే సిపిఒ బాధ్యత వహించాలని తెలిపారు. సమావేశంలో సిఐటియు ఉపాధ్యక్షులు ఎం.సుబ్బరామయ్య, కోశాధికారి కె.హరి నారాయణ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిహెచ్.చంద్రశేఖర్

ఆర్‌టిపిపిలో మాక్ ఫైర్ డ్రిల్

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

మండల పరిధిలోని ఆర్‌టిపిపిలో బుధవారం మాక్ ఫైర్ డ్రిల్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కడప డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ ప్రాక్టీస్ కృష్ణమూర్తి మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో ఉద్యోగుల, కార్మికుల భద్రతను నిర్ధారించడం ప్రాథమిక లక్ష్యమన్నారు. ఫైర్ సేఫ్టీ ప్రోటోకాల్, విధా నాలపై అవగాహన కల్పించేందుకు, శిక్షణ ఇవ్వడానికి మాక్ డ్రిల్ ఒక అవకాశం అన్నారు. అగ్ని, రసాయన విపత్తు, క్లోరిన్ గ్యాస్ లీక్, ప్యానెల్ బోర్డులో ఫ్లాష్ అవర్, గ్యాస్ లీకేజీ, వరద, తుఫాను, ఒక వ్యక్తికి గాయం లేదా మరణాన్ని కలి గించే అవకాశం ఉన్న అవాంఛనీయ సంఘటనల్లో చేయవలసిన విధివిధానాలను వివరించారు. ఆర్‌టిపిపి చీఫ్ ఇంజనీర్ గౌరీపతి, ఎస్ఇ సోమశేఖర్ రెడ్డి, సీనియర్ ఎస్ఇ దేవేంద్ర నాయక్, మేనేజర్ సిద్ధయ్య, ఎస్పీఎఫ్, ఫైర్, వివిధ విభాగాల సిబ్బంది, ఇతర పరిశ్రమల సేఫ్టీ అధికారులు పాల్గొన్నారు.

తవ్వారుపల్లెలో రేపు బండలాగుడు పోటీలు

ప్రజాశక్తి - ఖాజీపేట

మండల పరిధిలోని తవ్వారుపల్లె గ్రామంలో శ్రీ భక్త వీరాంజనేయ స్వామి ఆలయ 7వ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం ఎడ్లచే బండలాగుడు పోటీలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరుగుతాయన్నారు. తవ్వారుపల్లె రామాంజనేయ బృందం వారిచే కోలాట ప్రదర్శన నిర్వహిం చనున్నట్లు చెప్పారు. బండలాగుడు పోటీలో గెలుపొందిన విజేతలకు మొదటి బహుమతి రూ.40వేలు, రెండవ బహుమతి రూ.30,000, మూడవ బహుమతి రూ.20వేలు నగదు అందజేయనున్నట్లు కమిటీ ప్రతినిధులు తెలి పారు. అన్నదాన కార్యక్రమం కూడా ఉంటుందన్నారు. సాయంత్రం వీరాం జనేయ స్వామి గ్రామోత్సవ కార్యక్రమాన్ని వైభవోపేతంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆయా కార్యక్రమాలను విజయవంతం చేయాలని వారు కోరారు.

జిల్లాకు మంత్రి పదవి ఇవ్వకపోవడం శోచనీయం : పిసిసి

ప్రజాశక్తి - వేంపల్లె

రాష్ట్ర మంత్రి వర్గంలో కడప జిల్లాకు ప్రాతినిధ్యం లేకపోవడం శోచనీయమని పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి అన్నారు. బుధవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు ప్రాతి నిధ్యం ఉందన్నారు. జిల్లాలో 7 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా 4 నియో జకవర్గాల్లో టిడిపి, 1 నియోజకవర్గంలో మిత్రపక్షమైన బిజెపి గెలిచినట్లు చెప్పా రు. గెలిచిన వారందరు కూడా ఏదోక కోణంలో మంత్రి పదవికి అర్హులే అన్నారు.

విద్యార్థికి 'బాసట' ఆర్థిక సాయం

ప్రజాశక్తి-కడప అర్బన్

నగరానికి చెందిన బాసట స్వచ్ఛంద సేవా సంస్థ మిత్రులు, దాతలు, సభ్యుల సహకారంతో పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోంది. కడప జిల్లా ఒంటిమిట్ట మండలం కొండమాచుపల్లికి చెందిన పుత్తా శివహాసిని పదవ తరగతిలో 583 మార్కులు సాధించింది. తల్లి అనారోగ్యంతో ఆర్థిక ఇబ్బందులు పడుతూ మెరుగైన ఇంటర్మీడియట్ విద్య కొరకై బాసటను సంస్థని ఆశ్రయించగా బాసట అధ్యక్షులు బాసట సభ్యురాలు వై.మంజులారెడ్డికి తెలియజేశారు. ఆమె సన్నిహితురాలైన ఎం.జయంతికి విషయం తెలపగా వారి కుమార్తె, అల్లుడు ఎం.హర్షితరెడ్డి, అఖిల్‌రెడ్డి స్పందించి రూ.25 వేలు చెక్కును బాసట ద్వారా అందజేశారు. ఈ సందరరేగా దాతలు మాట్లాడుతూ బాసట ద్వారా మేలుపొందిన విద్యార్థులు భవిష్యత్తులో పలువురికి సాయం చేసే విధంగా ఎదగాలని హితవు పలికారు. కార్యక్రమంలో శివ హాసిని, ఆమె తల్లి, బాబాయ్ దాతలు చేసిన సాయానికి కృతజ్ఞతలు తెలిపారు.

చిన్నపిల్లలతో పనులు చేయిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి - కడప

దుకాణాల యజమానులు చిన్న పిల్లలతో పనులు చేయించుకోవడం చట్టరీత్యా నేరం అవుతుందని లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులు, లేబర్ డిపార్ట్‌మెంట్ అధికారులు, జిల్లా శిశు సంక్షేమ శాఖ అధికారులు సూచించారు. ప్రపంచ బాల కార్మికుల వ్యతిరేక దినోత్సవం, నిర్బంధిత కార్మికుల రక్షణ, పునరావాసం కార్యక్రమాలు బుధవారం జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ సెక్రెటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబా ఫక్రుద్దీన్ ఆదేశాల మేరకు కడప నగరంలో పలు ప్రాంతాలలో ర్యాలీ, న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ షాపు యజమానులు చిన్నపిల్లలతో పనులు చేయించుకోవడం చట్టరీత్యా నేరమన్నారు. షాపులలో చిన్నపిల్లలతో పనులు చేయించుకోరాదని, వయసు ధ్రువీకరణ పత్రాలు తీసుకొని షాపులలో పనిచేయించుకోవాలి, ఉచిత న్యాయ సహాయం మొదలగు అంశాలను వివరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పి.మనోహర్, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ అధికారులు మునిస్వామి శ్రీనివాసులు, డిస్టిక్ చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి సుభాష్, ఎల్‌పిఒ సునీత, పారా లీగల్ వాలంటరీలు శ్రీనివాసులు, విష్ణు, మహిళా పోలీసులు, షాపు యజమానులు, కార్మికులు పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న శిశు సంక్షేమ శాఖ అధికారులు

రాంప్రసాద్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న కస్తూరి, మాచినేని

మంత్రి 'మండిపల్లి'ని కలిసిన 'కస్తూరి'

ప్రజాశక్తి రైల్వేకోడూరు

రాయచోటి ఎమ్మెల్యే మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి రాష్ట్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కస్తూరి విశ్వనాథనాయుడు, ప్రముఖ పారిశ్రామికవేత్త మాచినేని విశ్వేశ్వరనాయుడు కలిసిన శుభాకాంక్షలు తెలిపారు. టిడిపి జాతీయ అధ్యక్షులుచంద్రబాబు నాయుడు నాలుగవసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం కార్యక్రమానికి రైల్వేకోడూరు నియోజకవర్గ నుంచి టిడిపి నాయకులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేస్తున్న సమయంలో పట్టణంలో టిడిపి, జనసేన కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు. ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారానికి హాజరైన వారిలో మాజీ జడ్‌పిటిసి నాయుడోరి రమణ, రాజంపేట పార్లమెంట్ టిడిపి ఉపాధ్యక్షులు పులేల రమేష్, క్లస్టర్ ఇన్‌ఛార్జి కాకర్ల రెడ్డయ్య, దుగ్గిన ఈశ్వరయ్య, నాయకులు పాల్గొన్నారు.

నేడు బి.కొత్తకోట మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-బి.కొత్తకోట

మండల సాధారణ సర్వసభ్య సమావేశం గురువారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ నూర్జహాన్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో జరుగుతున్న వివిధ రకాల అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలు తీరుపై ఈ సమావేశంలో చర్చించ నున్నట్లు తెలిపారు. వివిధ శాఖలకు చెందిన అధికారులు తమ శాఖలకు సంబంధించి ప్రగతి నివేదికలను సిద్ధం చేసుకొని రావాలన్నారు. మండలంలోని ఎంపిపి, జడ్‌పిటిసి, ఎంపిటిసిలు,సర్పంచ్‌లు, ప్రజా ప్రతినిధులు,వివిధ శాఖల అధికారులు తప్పక హాజరు కావాలని పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-పుల్లంపేట

మండలంలోని బ్రాహ్మణపల్లి సబ్ స్టేషన్ 220కెవి లైన్ మారుస్తున్న కారణంగా మండల పరిధిలోని రెడ్డిపల్లి, బావికాడపల్లి, వత్తలూరు, పుత్తనవారిపల్లి, దలవాయిపల్లి సబ్ స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాలకు ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని అసిస్టెంట్ ఇంజినీర్ చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు.విద్యుత్ వినియోగ దారులు విద్యుత్ అధికారులకు సహకరించాని కోరారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలందిస్తాం

ప్రజాశక్తి-గాలివీడు

ఎస్‌బిఐలో ఖాతాదారులుగా ఉన్న రైతులు, వ్యాపారస్తులకు శాఖ సేవలు అందిస్తామని బ్రాంచ్ మేనేజర్ జీ.వసంతలక్ష్మి పేర్కొన్నారు. బుధవారం నూతన బ్రాంచ్ మేనే జర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అనంతపురం నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చి బాధ్యత తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఇక్కడ పని చేసిన బ్యాంక్ మేనేజర్ జి.బాలకృష్ణుడు రాజంపేట హెడ్ బ్రాంచ్‌కు బదిలీపై వెళ్లారని పేర్కొన్నారు. తమ సిబ్బంది ద్వారా బ్యాంక్ సేవలను వినియోగదారులు అందరికీ సేవలు అందేటట్లు చూస్తామని పేర్కొన్నారు.

వర్షంతో పదును.. సాగుకు అనువు

ప్రజాశక్తి - చాపాడు

నాలుగు రోజులుగా మండలంలో పడుతున్న వర్షంతో పదునైంది. సాగుకు అనువైందని రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది. బుధవారం జోరువాన పడింది. ఉదయం నుంచి సాధారణంగా ఉన్న వాతావరణం ఒక్కసారిగా మారింది. వర్షం ప్రారంభమై రోజంగా పడింది. ఇప్పటికే పసుపు, ఇతర పంటల సాగులో రైతులు నిమగ్నమయ్యారు. మండల పరిధిలోని కుందూ నది కూడా ఉధృతంగా ప్రవహిస్తోంది. పచ్చిరొట్ట ఎరువులు సాగు చేసేందుకు రైతులు సిద్ధపడుతున్నారు. వ్యవసాయ అధికారులు కూడా జీలుగ, జనుము విత్తనాలను పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టారు. విత్తనాల నమోదుకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభించారు.

సచివాలయంలో.. తృటిలో తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి - ముద్దనూరు

ముద్దనూరు మేజర్ గ్రామ పంచాయతీ సచివాలయంలోని ఓ గదిలో విధులు నిర్వహిస్తున్న సచివాలయం సిబ్బందికి తృటిలో ప్రమాదం తప్పింది. బుధవారం ఉదయం సిబ్బంది విధులు నిర్వహిస్తున్న సమయంలో గదిలో ఏర్పాటు చేసిన పిఒపి పైకప్పు ఊడి కింద పడింది. దీంతో మహిళా సిబ్బంది భయభ్రాంతులకు గురై పరుగులు తీశారు. తృటిలో ప్రమాదం తప్పడంతో ఉద్యోగులు ఊపిరి పీల్చుకున్నారు.

ప్రతి గ్రామానికి మినరల్ వాటర్

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో.. ప్రతి ఒక్కరికీ మినరల్ వాటర్ అందిస్తామని మున్సిపల్ టిడిపి ఇన్‌ఛార్జి మద్దూరు వెంకట రామిరెడ్డి అన్నారు. బుధవారం మున్సిపల్ పరిధిలోని పల్లె గ్రామ బిసి కాలనీలో ఆయన వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ 2018లో అప్పటి రాజ్యసభ సభ్యుడు సీఎం సురేష్ నిధులతో వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారని, 2019లో ముఖ్యమంత్రిగా వైయస్ జగన్మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టడంతో ఆ ప్లాంట్ కనుమరుగైందన్నారు. ఇప్పుడు ఆ ప్లాటును వెంకట్రామిరెడ్డి తన సొంత నిధులతో సుమారు రూ.52,000తో మరమ్మతులు చేపట్టి బుధవారం మళ్లీ ప్రారంభించారు. ఏ గ్రామంలోనైనా వాటర్ ప్లాంట్ లేకపోతే తమ దృష్టికి తెస్తే అక్కడ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేయడంతో మళ్లీ ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అగ్రగామిగా రూపురేఖలు మారుస్తారన్నారు. టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

టాటా సంస్థ కృషి అభినందనీయం

- జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి సురేష్ కుమార్

ప్రజాశక్తి-కడప అర్బన్

ఐటిఐ విద్యార్థుల కోసం జిల్లాలో టాటా స్ట్రైవ్ చేస్తున్న కృషి అభినందనీయమని జిల్లా ఎంప్లాయిట్ అధికారి సురేష్ కుమార్ అన్నారు. బుధవారం జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఐటిఐ వారికి కడప ప్రభుత్వ ఐటిఐలో డెట్ టాటా స్ట్రైవ్, సీమన్స్ కార్యక్రమంలో భాగంగా ప్రాజెక్టుల పోటీలు నిర్వహించారు. జిల్లాలోని 10 ఐటిఐల నుంచి 26 ప్రాజెక్టులు ప్రదర్శించారు. ప్రాజెక్టును ప్రారంభించిన సురేష్ కుమార్ మాట్లాడుతూ ప్రాజెక్టుల ద్వారా విద్యార్థుల్లో మంచి పరిణామాలు వెలికి వస్తాయని పేర్కొన్నారు. ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ సంతోష్ కుమార్ మాట్లాడుతూ టాటా సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని చెప్పారు. విద్యార్థుల్లో పోటీతత్వం పెరిగి కొత్త పరిశ్రమలు తీసుకురావాలనే ఆలోచన కలిగించాలన్నదే తమ ప్రయత్నమని పేర్కొన్నారు. ఐటిఐల కన్వీనర్ జ్ఞాన కుమార్, ఎడి రత్నరాజు మాట్లాడుతూ ఐటిఐ అభివృద్ధి, విద్యార్థుల ప్రావీణ్యం కోసం టాటా సంస్థ చేస్తున్న కృషి అభినందనీయమని చెప్పారు. కార్యక్రమంలో ఐటిఐ ప్రిన్సిపల్, టెక్నికల్ సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రబాబు, పవన్‌కు శుభాకాంక్షలు

ప్రజాశక్తి-కడప : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన నారా చంద్రబాబునాయుడు, మంత్రిగా ప్రమాణ శ్రీకారం చేసిన పవన్ కల్యాణ్‌లకు కడప బార్ అసోసియేషన్ అధ్యక్షులు బొగ్గుల గుర్రప్ప శుభాకాంక్షలు తెలిపారు. నారా లోకేష్, నాదెండ్ల మనోహర్, రాంప్రసాద్‌రెడ్డికి అభినందనలు తెలిపారు.

మంత్రి ఫరూఖ్‌కు సన్మానం

ప్రజాశక్తి-కడపఅర్బన్ : మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన ఎన్ఎండి ఫరూక్‌ను విజయవాడలో టిడిపి నాయకులు అమీర్‌బాబు సన్మానించారు. అచ్చెన్నాయుడు, మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డిలకు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ ప్రధాన కార్యదర్శి నాసర్‌అలీ, కడప తెలుగు యువత నగర మాజీ అధ్యక్షులు మేకల వెంకటేష్ యాదవ్, తెలుగు యువత నూర్ బాషా పాల్గొన్నారు.

వయోజన బిసిజి టీకాతో టిబి దూరం

నందలూరు : సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ శరత్‌కమల్

ప్రజాశక్తి-నందలూరు

బిసిజి టీకా వేయించి టిబి వ్యాధి నివారణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని మండల ప్రభుత్వ వైద్యాధికారి శరత్‌కమల్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక పిహెచ్‌సిలో వైద్య ఆరోగ్య సిబ్బందితో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువారం వయోజనులకు 60 సంవత్సరాలు నిండిన వారికి, 18 సంవత్సరాల వయసు నిండి 60 సంవత్సరాల వయసులోపు ఉండిన వారికి, 5 సంవత్సరాల కిందట టిబి వ్యాధి వచ్చి తగ్గిన వారికి, షుగర్ వ్యాధిగ్రస్తులకు, పొగ త్రాగుతూ చాలించిన వారికి, ఇప్పుడు పొగ తాగేవారికి, టీబి వ్యాధిగ్రస్తులతో ఎక్కువ సంబంధాలు ఉన్నవారికి, బాడీ మాస్ ఇండెక్స్ 18 కంటే తక్కువ ఉన్నవారికి టీకా వేసుకోవచ్చని తెలిపారు. మండల పరిధిలోని గ్రామ ప్రజలు బిసిజి టీకా వేయించుకోవాలని ఆయన సూచించారు. బిసిజి టీకా వేయించుకొనుట వలన ఎటువంటి హాని ఉండదని ప్రతి సోమ, గురువారాలలో బిసిజి టీకాలు గ్రామాలలో, ప్రతి రోజు ప్రాథమిక కేంద్రంలో వేస్తారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ కార్తీక్ విశ్వనాథ్, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పీలేరు: క్షయ వ్యాధి వ్యాప్తిని సమూలంగా నిర్మూలించే బిసిజి ముద్ర సూది గుర్తించిన పెద్దలందరూ టీకా వేసుకుని టిబి అంతానికి సహకరించాలని పిహెచ్‌సి తలుపుల ప్రధాన వైద్యాధికారి డాక్టర్ రమేష్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. గూడరేవుపల్లె గ్రామంలో ఏఆరోగ్య ప్రదాత- పెద్దలకిచ్చే బీసీజీ టీకా' అంశంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ జాతీయ ఆరోగ్య మిషన్ ద్వారా అమలయ్యే బిసిజి వ్యాక్సిన్ ఇప్పటి వరకు కేవలం శిశువులకు మాత్రమే ఇస్తుండగా ప్రస్తుతం క్షయ నిర్మూలనే ప్రధాన లక్ష్యంగా తొలి సారిగా వయోజనులకు టీకా వేస్తున్నట్లు తెలిపారు. మూడు నెలల్లో బిసిజి టీకా లబ్ధిదారులకు, వారి నివాస ప్రాంతంలోనే ఇవ్వడం జరుగుతుందన్న అపోహలు వీడి గుర్తించిన అందరూ టీకా వేసుకుని క్షయ రహిత దేశంగా తీర్చిదిద్దడంలో సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పర్యవేక్షకులు పవన్ హెల్త్ ఎడ్యుకేటర్ కొండయ్య, శ్రీనువాసులు, ఏఎన్ఎం ఫామున్నిసా, సిహెచ్‌ఒ లావణ్య ,రత్నం, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పీలేరు : టిబిపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

చంద్రబాబు ప్రమాణం వేళ టిడిపి సంబరాలు

ములకలచెరువు: జయచంద్రారెడ్డి ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకుంటున్న టిడిపి శ్రేణులు

ప్రజాశక్తి -మదనపల్లె అర్బన్

పట్టణంలోని మోతినగర్‌లో బుధవారం టిడిపి శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. చంద్రబాబును ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తున్న సమయంలో టిడిపి సీనియర్ నాయకుడు ఎస్‌ఎ.మస్తాన్ సతీమణి నశ్రీన్‌తాజ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేప ట్టారు. మోతీనగర్‌లోని పార్టీ కార్యకర్తలు, ఆ ప్రాంతవాసులు, ప్రజలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై కేక్‌కట్ చేసి స్వీట్స్ పంచుకున్నారు. ఎమ్మెల్యే షాజహాన్‌బాషా కృషితో మదన పల్లె అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో మోతీనగర్ వాసులు, పార్టీ కార్యకర్తలు పాల్గొ న్నారు. ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తమ్ముడు జంషీర్‌బాషా ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రధాన కూడళ్లలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక బెంగళూరు బస్టాండ్‌లో పెద్ద ఎత్తున బాణాసంచా కాల్చి, కేక్ కట్ చేసి స్వీట్లు పంచు కున్నారు. కార్యక్రమంలో నాయకులు ఎస్‌ఎ.మస్తాన్, చిన్ని, బాబ, మాజీ కౌన్సిలర్లు రాధమ్మ, పులి మహాలక్ష్మి, కార్యకర్తలు పాల్గొన్నారు. **పుల్లంపేట :** చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం సందర్భంగా రెడ్డిపల్లి మాజీ సర్పంచ్ రొంపిచర్ల మురళి ఆధ్వర్యంలో సంబరా లు నిర్వహించారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ అమరావతి సృష్టికర్త, పేదల పాలిటి పెన్నిధి, అన్న క్యాంటీన్ సృష్టికర్త చంద్ర బాబు నాయుడు అని కొనియాడారు. **పీలేరు :** రాష్ట్రంలో ఎన్‌డిఎ ప్రభుత్వం ఏర్పాటుకు శ్రీకారం చుడుతూ ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రివర్గం ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా పీలేరులో టిడిపి శ్రేణులు కేక్ కట్ చేసి తమ హర్షాన్ని వ్యక్తం చేస్తూ సంబరాలు చేసుకున్నారు. కార్యకర్తలు, అభిమానులు పలు చోట్ల బాణ సంచా పేల్చి, కేక్ కట్ చేసి తమ ఆనందం, అభిమానాన్ని అందరితో పంచు కున్నారు. పట్టణంలోని పాత బస్టాండ్ ప్రాంతంలో టిడిపి శ్రేణులు మల్లెల రెడ్డిబాషా, షేక్ మహబూబ్ షరీఫ్, షేక్ సాదిక్ షరీఫ్(మున్న) ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి రాష్ట్ర నూతన ముఖ్యమంత్రిగా చంద్రబాబు, పలువురు మంత్రులు ప్రమాణం చేసిన సందర్భంగా వారు శుభాకాంక్షలు తెలిపారు. ఇక చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధితో పాటు రూపురేఖలు మారనున్నాయన్న ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో చెన్నారెడ్డి కాలనీ హరి, కాలేష, వసీం, అప్సర్ బాష, షమ, రమాదేవి, చంద్ర లేఖ, జిలాని, రమేష్, వెంకట రమణ, దేవరాజులు నాయుడు తదితరులు పాల్గొన్నారు. స్థానిక అంబేద్కర్ సర్కిల్లో పోతంశెట్టి రమేష్, రహత్ బాషా, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు రామచంద్రయ్య ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టి అభిమానాన్ని చాటుకున్నారు. **ములకలచెరువు:** రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం జరగాలంటే పేద ప్రజల పెన్నిధి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుతోనే సాధ్యమని టిడిపి నాయకులు జయచంద్రారెడ్డి, దొరస్వామినాయుడు, మండల కన్వీనర్ పాలగిరీ సిద్ద పేర్కొన్నారు. బుధవారం ములకల చెరువులో చంద్రబాబు ప్రమాణస్వీకార కార్యక్రమంలో భాగంగా భారీ ఎత్తున కేక్ కట్ చేసి నాయకులకు, కార్యకర్తలకు పంచి పెట్టారు. ఆనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలు చంద్రబాబుప్రమాణస్వీకారం ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్నారు. టిడిపి, జనసేన, బిజెపి పార్టీల కూటమి భారీ 175 స్థానాలకు గాను 164 సీట్లు అత్యధిక మెజారిటీతో గెలవడం తెలుగు తమ్ముళ్లలో మరింత ఉత్సాహాన్ని నింపిందని అన్నారు. కార్యక్రమంలో కేబీఎన్ మండి యజమాని బాబునాయుడు, విజయకుమార్ నాయుడు, శ్రీనివా సులు నాయుడు, ప్రతాప్ నాయుడు, టిడిపి నాయకులు చెన్న కృష్ణ, కేశవులు, కట్ట హరి, ప్రతాప్, రవి, ఊరగాయల రామచంద్ర పాల్గొన్నారు.

మహిళా సమాఖ్య కార్యాలయాల్లో..

కలికిరి : ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని మండలంలోని మహిళా సమాఖ్య కార్యాలయంలో మండల అధికారులలతో వీక్షించినట్లు ఎంపిడిఒ రామకృష్ణ తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ప్రమాణ స్వీకార మహోత్సవానికి వీడియో ద్వారా మండలంలోని అధి కారులు వీక్షించినట్లు తెలిపారు. తహశీల్దార్ విజయనిర్మల, వెలుగు సిసిలు, ఆంజనేయులు, ఏకాంబరం, ప్రభాకర, చంద్రకళ, సంఘమిత్రాలు, మరియు ఐకెపి సిబ్బంది, ఉపాధి హామీ ఎఒ సుజాత పాల్గొన్నట్లు తెలిపారు. **నిమ్మనపల్లి :** దేశ ప్రధాని నరేంద్రమోడీ, రాష్ట్ర గవర్నర్ సమక్షంలో ముఖ్యమంత్రిగా చంద్ర బాబునాయుడు, రాష్ట్ర మంత్రిగా జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా అన్ని ప్రభుత్వం కార్యాల యాలకు విద్యుత్ కాంతులను అమర్చారు. చంద్రబాబు ప్రమాణస్వీకారాన్ని మండలం మహిళా సమాఖ్య కార్యాలయంలో ఎపిఎం రజినికుమారి, సంఘమిత్రలు, డ్వాక్రా మహిళలతో కలసి వీక్షించారు. నిమ్మనపల్లి బస్టాండ్ కూడలిలో మండల మాజీ అధ్యక్షులు రెడ్డప్పరెడ్డి ఆధ్వర్యంలో టిడిపి నాయకులు సంబరాలను జరుపు కున్నారు. రాష్ట్ర ప్రజలకు ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీలను కూటమి ప్రభుత్వం అమలు పరుస్తుందని అన్నారు.

'మండిపల్లి'కి మంత్రి పదవి దక్కడం హర్షణీయం

ప్రజాశక్తి-రాయచోటి

రాయచోటి ఎమ్మెల్యే మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి మంత్రిగా రావడం పట్ల రాయచోటి నియోజకవర్గ వాసిగా హర్షం వ్యక్తం చేస్తున్నట్లు మాజీ కో-ఆప్షన్ సభ్యులు సలావుద్దీన్ పేర్కొన్నారు. పట్టణంలోని బండ్లపెంట దర్గాలో రాంప్రసాద్‌రెడ్డికి మంత్రి పదవి రావడంపై ముస్లింలతో కలిసి ఆయన ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గతంలో రాంప్రసాద్ రెడ్డి తండ్రి నాగిరెడ్డి, అన్న నారాయణరెడ్డి, అక్క శ్రీలత ఎన్నికల్లో పోటీ చేసినప్పుడు కూడా మండి పల్లె కుటుంబం వెంటే ఉన్నామని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి రాయచోటి ముస్లింలను నాలుగు సార్లు మాయ మాటలు చెప్పి ఓట్లు వేయించుకొని ముస్లింలను మోసం చేశారన్నారు.కార్యక్రమంలో కో-ఆప్షన్ సభ్యులు ఆసిఫ్ అలీఖాన్, టిడిపి యువ నాయకులు మసూద్ అలీఖాన్, గయాజ్ అలీఖాన్, ఖాదర్ హుస్సేన్, బాషా, వహీద్ ,గౌస్, దర్గా కమిటీ మెంబర్ ఇసాక్, ముస్లిములు పాల్గొన్నారు. **ఒంటిమిట్ట :** రాష్ట్ర మంత్రి వర్గంలో రాయచోటి ఎమ్మెల్యే మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి చోటు దక్కడం హర్షణీయమని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర డైరెక్టర్ కొమర వెంకట నరసయ్య పేర్కొన్నారు. బుధవారం టిడిపి కార్యకర్తలు, నాయకులు మంత్రి పేరు మీద కేకును కట్ చేసి కార్యకర్తలు అందరూ పంచుకున్నారు. అనంతరం బాణాసంచి పేల్చి సంబరాలు జరుప కున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్ర బాబు రాంప్రసాద్ రెడ్డికి మంత్రివర్గంలో చోటు ఇవ్వడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. అన్న మయ్య జిల్లాలోని అన్ని నియోజకవర్గాలతో పాటు రాజం పేటలోని ఆరు మండలాలకు మంచి జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. **రామపురం:** రాంప్రసాద్‌రెడ్డికి మంత్రి పదవి రావడంతో మండలంలోని టిడిపి నాయకులు ఆనంద ఉత్సవాలు జరుపుకున్నారు. మండలంలోని రామాపురంలో నల్లగుట్టపల్లి మాజీ ఎంపిటిసి ఎం.రవికు మార్‌రెడ్డి ఆధ్వర్యంలో సరస్వతిపల్లిలో రాజంపేట పార్లమెంట్ టిడిపి ఉపాధ్యక్షుడు గడికోట విజయభాస్కర్‌రెడ్డి, అన్నయ్య ఆధ్వర్యంలో చిట్లూరులో టిడిపి నాయకుడు గాలివీటి సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో బాణాసంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు. ఏకిలపల్లిలో రామకృష్ణ గౌడ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి ఉత్సాహని చూపారు. కార్యక్రమంలో దేవనాథరెడ్డి యోగానిజంరెడ్డి, వెంకటరమణారెడ్డి, లక్ష్మయ్య, సహదేవరెడ్డి, మాజీ సర్ మై సర్పంచ్ మాజీ సర్పంచ్ వెంకటరమణ దర్బార్ రమేష్ కుమార్ ప్రకాష్ ప్రసాద్ మధ్యలో వెంకట్ రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.**గాలివీడు:** ఎమ్మెల్యే మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పదవి దక్కడంలో మండలంలో టిడిపి శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు.మొట్ట మొదటిసారి ఎమ్మెల్యేగా గెలుపొందిన వెంటనే మంత్రిగా అవకాశం దక్కడం హర్షణీయమని అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో 17 గ్రామాల నుంచి వచ్చిన పార్టీ నాయకులు, కార్యకర్తలు అందరూ బాణసంచా పేలుస్తూ హర్షం వ్యక్తం చేశారు. రాయచోటి నియోజకవర్గంలో ప్రజలకు సేవ చేయడానికి మండిపల్లి కుటుంబం ద్వారా నియోజకవర్గ అభివృద్ధి జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. **చిన్నమండెం:** ఎమ్మెల్యే మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి మొదటిసారిగా రాష్ట్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తున్న సందర్భంగా తన సొంత మండలం లోని ప్రజలు, అభిమానులు ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని ఎల్ఇడి స్క్రీన్‌పై వీక్షించి బాణ సంచా పేల్చి సంబరాలు జరుపుకున్నారు. రాయచోటికి మొట్టమొదటిసారి మంత్రి పదవి రావడం స్థానిక ప్రజలకు చాలా సంతోషాన్ని ఇచ్చిందని నాయకులు తెలిపారు. రాయచోటి నియోజవర్గ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేసే వ్యక్తి మంత్రి కావడం ఈ ప్రాంత ప్రజల అదృష్టమని అన్నారు.

రాయచోటి: మాట్లాడుతూ సలావుద్దీన్

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు : ఎడిఎ

రికార్డులు తనిఖీ చేస్తున్న ఎడిఎ వెంకటసుబ్బయ్య

ప్రజాశక్తి - వేంపల్లె

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ముద్దనూరు వ్యవసాయశాఖ సహయ సంచాలకులు వెంకటసుబ్బయ్య హెచ్చరించారు. బుధవారం వేంపల్లెలోని ఆయా ప్రాంతాల్లో ఉన్న ఎరువుల దుకాణాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు, లైసెన్సు పత్రాలను పరిశీలించి, స్టాక్ వివరాలను తెలుసుకున్నారు. అనం తరం ఎడిఎ మాట్లాడుతూ జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ఎరువుల దుకాణాలను తనిఖీలు చేస్తున్నట్లు చెప్పారు. ప్రతి ఎరువుల దుకాణపు యాజమాని రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులను మాత్రమే విక్ర యిం చాలని సూచించారు. రైతులు కొనుగోలు చేసిన ఎరువులకు రసీదు తప్పక ఇవ్వాలన్నారు. ఎరువుల ధరలను నోటీసు బోర్డులో ఉం చాలన్నారు. ఎరువుల కొరత సృష్టిస్తే అలాంటి దుకాణ యాజ మాన్యంపై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వేంపల్లె ఎఒ రాజేంద్రప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

అరటి పిలకలకు డిమాండ్

ప్రజాశక్తి - సింహాద్రిపురం

నర్సరీలో పెరుగుతున్న అరటి పిలకలు

పులివెందుల నియోజకవర్గంలో అరటి సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. అరటి పిలకలకు విపరీతంగా డిమాండ్ వచ్చింది. ఆ మేరకు పలు కంపెనీలు పిలకలను సరఫరా చేయలేకపోతున్నాయి. ఇదే అదునుగా కొందరు డీలర్లు ధరలను అమాంతంగా పెంచి సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. నియోజవర్గంలోని పులివెందుల, లింగాల, వేముల, తొండూరు, సింహాద్రిపురం మండలాల్లో గతంలో 18 వేల ఎకరాల్లో సాగవుతుండగా ఈ ఏడాది 24 వేల ఎకరాలకు పెరుగుతుందని ఉద్యానశాఖ అధికారులు చెబుతున్నారు. రెండేళ్ల నుంచి అరటికాయల ధరలు స్థిరంగా ఉన్నాయి. అలాగే చీనీ చెట్లకు విపరీతమైన తెగులు ఆశించి ఎండి పోయాయి. ఈ పరిస్థితుల్లో చాలామంది రైతులు అరటి వైపు మొగ్గుచూపుతున్నారు.

సరఫరా చేయలేకపోతున్న డీలర్లు..

ఈ ఏడాది ఏప్రిల్, మే నెలలో అధిక ఉష్ణోగ్రతల కారణంగా ఉత్పత్తి అయిన అరటి పిలకలు నర్సరీలలో ఎక్కువగా చనిపోయాయని డీలర్లు చెబుతున్నారు. ఈ కారణంగా అడ్వాన్స్ చెల్లించినప్పటికీ డీలర్లు సరఫరా చేయలేక పోతున్నట్లు తెలుస్తోంది. దీనికి తోడు ఇటీవల వర్షం కురవడం, భూమి సైతం అనుకూలం కావ డంతో పిలకలు నాటేందుకు రైతులు ఆసక్తి చూపు తున్నారు. ఇదే అదునుగా భావించిన కొంతమంది డీలర్లు ధరలు అమాంతం పెంచినట్లు తెలు స్తోంది. ముఖ్యంగా పులివెందుల ప్రాంతంలో ఎక్సెల్, జైన్, మైక్రోసాన్, క్యాడ్లిల్, కేవఫ్ బయోటెక్‌తోపాటు మరికొన్ని కంపెనీల పిలకలు నాటుతున్నారు. గతంలో ఒక అరటి పిలక రూ.12 నుంచి రూ.14 వరకు ఆయా కంపె నీలను బట్టి ధరలు ఉండేవి. ప్రస్తుతం కొన్ని కంపెనీల అరటి పిలకలు రూ.18.25 చెల్లిస్తేనే సరఫరా చేస్తామని డీలర్లు చెబుతున్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ధరల నియంత్రణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి..

అరటి పిలకల ధరల నియంత్రణలో ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు. టిష్యూ కల్చర్ పిలకలు నర్సరీలోనే నాలుగు నుంచి ఐదు ఆకులు ఉన్న మొక్కలు నాటినప్పుడే బాగా బతికే అవకాశం ఉంటుందని సాగు రైతులు చెబు తున్నారు. ప్రస్తుతం డిమాండ్ కారణంగా పలు కంపెనీల డీలర్లు కేవలం రెండు ఆకులు ఉన్న పిలకలు మాత్రమే సరఫరా చేస్తున్నారు. ఈ కార ణంగా రైతులు మరో వారం నుంచి పది రోజులు పాటు తమ వ్యక్తిగత నర్సరీలలో పెంచుకుని నాటుకోవాల్సిన పరిస్థితి నెలకొంటోంది.

ధరలు పెరగకుండా చర్యలు తీసుకోవాలి..

ప్రభుత్వం అరటి పిలకలు ధరలు పెరగకుండా చర్యలు తీసుకోవాలి. డిమాండ్ ఆధారంగా ధర పెంచడం పట్ల రైతులు తీవ్రం గా నష్టపోతున్నారు. ప్రభుత్వం నిర్ణీత ధరను నిర్ణయించి ఆ ప్రకారం విక్రయాలు చేపట్టేలా డీలర్లకు ఆదేశాలు జారీ చేయాలి.

- నరేంద్ర, అరటి రైతు, గురజాల

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా..

ప్రస్తుతం అరటి పిలకలకు డీలర్లు ధరలు పెంచినట్లు మా దృష్టికి వచ్చింది. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్చిస్తాం. తగు చర్యలు తీసుకుంటాం.

- మల్లేశ్వర్‌రెడ్డి, ఉద్యానశాఖాధికారి, ముద్దనూరు

15 నుంచి ఆసర్ల గంగమ్మ జాతర

ప్రజాశక్తి-గాలివీడు

స్థానిక పంచాయతీ అరవీటివాండ్లపల్లిలో ఉన్న ఆసర్ల గంగమ్మ జాతర శని ఆదివారాల్లో నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు పేర్కొన్నారు. శనివారం ఉదయం అభిషేకం, సిద్ధలపూజ, జ్యోతుల ఊరేగింపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చాందిని బండ్లతో సాయంత్రం అమ్మవారికి ప్రత్యేక అలంకరణ, రాత్రి 7 గంటలకు అన్నదాన కార్యక్రమం చేపడు తున్నట్లు తెలిపారు. డీజే చాందిని బండ్లతో కోలాటాలు, బాణసంచాలతో వైభవంగా నిర్వహించి ఆదివారం ఉదయం ఐదు గంటలకు జ్యోతుల అగ్నిగుండం ప్రవేశం, ఉదయం 6 గంటలకు బోనాలు సమర్పణ, సాయంత్రం 4 గంటలకు చీరలు వేలంపాట, రాత్రి 9 గంటలకు కల్లుపాటు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ప్రతి ఒక్కరికీ అండగా ఉంటాం

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

టిడిపి నాయకుల ప్రలోభాలకు ఎవరూ లొంగవద్దని, ప్రతి ఒక్కరికీ అండగా ఉంటామని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైస్ చైర్మన్ వైస్ మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. మున్సిపల్ కౌన్సిల్ హాలులో బుధవారం కౌన్సిలర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి ఓటమి చాలా బాధాకరమన్నారు. ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవించాలన్నారు. పులివెందుల నియోజకవర్గ అభివృద్ధికి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు వైయస్ జగన్మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన పాడా ఉండకపోవచ్చు.. దీంతో పులివెందుల ప్రాంత అభివృద్ధికి ఆటంకం కలగవచ్చని తెలిపారు. ప్రస్తుతం ఏర్పడిన కొత్త ప్రభుత్వం పాడాను అలాగే ఉంచి పులివెందుల అభివృద్ధికి పాటుపడితే బాగుంటుందని సూచించారు. జగన్మోహన్‌రెడ్డి సారథ్యంలో తప్పకుండా మళ్లీ అధికారంలోకి వస్తామన్నారు. కార్యకర్తలు, నాయకులు ఎవరు కూడా అధైర్యపడవద్దని పేర్కొన్నారు. రూ.800 కోట్లతో పులివెందుల మున్సిపాలిటీని వైస్ జగన్మోహన్‌రెడ్డి అభివృద్ధి చేశారని, ప్రస్తుతం ఆ పనులన్నీ ఇంకా పూర్తి చేయాల్సి ఉందన్నారు. ఆ మేరకు నిధులు ఇంకా అవసరం ఉందన్నారు. అనంతరం మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో పులివెందుల మున్సిపాలిటీ అభివృద్ధి కార్యక్రమాల అజెండాను కౌన్సిల్ ముందు ఉంచి వాటిని ఆమోదింపజేశారు. సమావేశంలో కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

కారు బోల్తా : భార్యాభర్తలకు గాయాలు

- తప్పిన ప్రాణాపాయం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

డ్రైవర్ నిద్రమత్తు కారణంగా కారు బోల్తా పడి భార్యాభర్తలు తీవ్రంగా గాయ పడ్డారు. ఈ సంఘటన బుధవారం కురబ లకోట మండలంలో చోటు చేసుకుంది. ముది వేడు పోలీసుల కథనం మేరకు.. నంద్యాల జిల్లా, ఆళ్లగడ్డకు చెందిన కుమారస్వామి రాజు, జయలక్ష్మి దంపతులు సొంత పనిపై అద్దె కారులో బెంగుళూరుకు బయలుదేరినట్లు తెలిపారు. మార్గ మధ్యంలోని ముదివేడు గురుకుల పాఠశాల వద్ద డ్రైవర్ రాజు నిద్ర మత్తుతో కారు అదుపు తప్పి బోల్తా పడిందని అన్నారు. ఈ ప్రమాదంలో డ్రైవర్ స్వల్పంగా గాయపడగా, దంపతులు తీవ్రంగా గాయపడ్డారని చెప్పారు. సమాచారం మేరకు 108 సిబ్బంది మనోహర్ బాధితులను మదనపల్లె సర్వజన బోధనాస్పత్రికి తరలించినట్లు తెలిపారు. సకాలంలో వైద్యులు చికిత్స అందించడంతో ప్రాణాపాయం తప్పి కోలుకుంటు న్నట్లు పేర్కొన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఫ్యాన్‌కు ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

ప్రజాశక్తి-చెన్నూరు

స్థానిక బ్రాహ్మణ వీధికి చెందిన సాదు మహేష్ వయసు (22) అనే యువకుడులో మద్యం కు బానిసై తన ఇంటిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం మేరకు.. చెన్నూరు బ్రాహ్మణవీధికి చెందిన సాదుశేఖర్ కుమారుడు వృత్తి రీత్యా ఒక మెడికల్ కంపెనీలో ప్రయివేట్ ఉద్యోగం చేస్తున్నాడని తెలిపారు. యువకుడి తల్లి దండ్రుల చనిపోవడంతో ఒంటరిగా ఉంటూ మనోవేదనకు గురై మద్యానికి అలవాటు పడి మనస్తపాముతో తన ఇంటిలో ఫ్యాన్ కు ఉరి వేసుకొని ఆత్మ హత్య చేసుకుని మృతి చెందినట్లు చెప్పారు. బుధవారం ఉదయం 10 గంటల సమయంలో సాదు మహేష్ ఇంటి నుండి కుళ్ళిన వాసన రావడం తో చుట్టూ ప్రక్క వారు గమనించి చూడగా సాదు మహేష్ మృతదేహం కుళ్ళిపోయి, ఉబ్బి ఉండటంతో సమాచారం ఇచ్చారని తెలిపారు. సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించి విచారణ చేయగా మృతుడు సుమారు మూడు రోజుల క్రిందట చనిపోయినట్లు తెలుస్తోందని అన్నారు. డాక్టర్‌ను పిలిపించి అక్కడే పోస్టుమార్టం నిర్వహించి కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.